విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

పల్లెల్లో క్రిస్మస్ సందడి

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్రిస్మస్‌ను ఆరాధించే వారికి అతి ముఖ్యమైన పండుగ అందుకు నెలరోజులు ముందు నుంచి గ్రామాలలో చర్చిల వద్ద ప్రత్యేకంగా తయారుచేసిన విద్యుత్ స్టార్‌ను అందంగా అలంకరించి ఏర్పాటు చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవులు తమ నివాసాలకు రంగురంగుల స్టార్‌లు ఎల్ఈడి లైట్లు క్రిస్మస్ ట్రీలను ప్రత్యేకంగా అలంకరించుకుంటున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సుచిత్ర

విశాలాంధ్ర-ఒంగోలు : తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని మర్యాదపూర్వకంగా టిడిపి దివంగత నేత ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి, ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర కలిశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర-పామూరు : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా సేకరించిన సంతకాలును సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అందజేయడం జరుగుతుందని వైసీపీ పామూరు మండల అధ్యక్షులు గంగాసాని హుస్సేన్ రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు స్థానిక కార్యాలయం నుండి ర్యాలీగా కనిగిరి వెళ్లడం జరుగుతుందని, అక్కడనుండి ఇంచార్జి దద్దల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఒంగోలు బయలుదేరారు. జడ్పీటీసీ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి పార్టీ వివిధ అనుబంధ విభాగాల సభ్యులు,కో-ఆప్షన్ సభ్యులు,ఎంపీటీసీలు, సర్పంచ్ లు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసినదిగా హుస్సేన్ రెడ్డి కోరుచున్నారు.

మైనింగ్ అధికారులు అంటూ నంబర్ లేని వాహనంలో ప్రయాణం

విశాలాంధ్ర -చీమకుర్తి: చీమకుర్తి పరిసరాల్లో ఎటువంటి నెంబర్ లేని బొలెరో వాహనంలో కొందరు వ్యక్తులు వచ్చి గ్రానైట్ లారీలను కంకర్ లారీలను మట్టి లారీలను, ట్రాక్టర్ లను ఆపి చెకింగ్ పేరుతో బెదిరిస్తున్నారు. మేము నెల్లూరు జిల్లాకు చెందిన మైనింగ్ విజిలెన్స్ ఆఫీసర్‌లమని ఐడి కార్డులు చూపిస్తున్నారు. ఒంగోలు కర్నూల్ రోడ్‌లోని వేగంగా వెళుతున్న వాహనాలను ఎదురుగా వచ్చి ఆపుతున్నారు. ఇలాగే చిలకలూరిపేట వద్ద వేగంగా వెళుతున్న లారీలను అడ్డువచాపగా ఐదుగురు విద్యార్థులు చనిపోయారు. మన ఒంగోలు కర్నూల్ రోడ్‌లో వాహనాల రద్దీ ఎలా ఉంటుందో తెలుసు కాబట్టి ఇలా ఆపి మేము నెల్లూరు మైనింగ్ ఆఫీసర్ల మని విజిలెన్స్ ఆఫీసర్లమని, కస్టమ్స్ ఆఫీసర్స్ అని చెబుతున్న వీరిని విచారించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఐ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేసిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాసరావు. వెంటనే పోలీసులు వారిని పట్టుకుని పోలీస్ స్టేషన్లోకి బొలెరో వాహనాన్ని తరలించి వారిని విచారిస్తున్నారు.

మల్లికార్జునరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - బేస్తవారిపేట : గత 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ మండలంలోని జేసీ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో పీఎస్ హెచ్ఎంగా పని చేస్తూ నవంబర్ 30న పదవీ విరమణ చేసిన దుమ్మని మల్లికార్జునరావుకు బేస్తవారిపేటలోని ఆయన స్వగృహం వద్ద ఆదివారం పదవీ విరమణ అభినందన సభను ఏర్పాటుచేశారు. ఎంఈఓ - 1 ఎన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నిగర్వి, స్నేహశీలి, సేవాభావం, వృత్తి పట్ల అంకితభావంతో గత 40 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి అందరి మన్ననలు పొందిన వ్యక్తి మల్లికార్జునరావు అని కొనియాడారు. పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బంధువులు, గ్రామస్తులు మల్లికార్జున రావు దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ కరుణాకర్, కొమరోలు ఎంఈఓ బీవీ రత్నం, ప్రధానోపాధ్యాయులు ఎస్ భాస్కర్ రావు, పద్మావతి, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారులు బాలచంద్రుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వర మహాదేవి ఆరాధన

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో ఈశ్వర మహాదేవి 236వ ఆరాధన మహోత్సవం ధర్మకర్త భైరవానంద స్వామి ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు, నైవేథ్యాలతో పాటు మంగళ హారతులిచ్చారు. పోతులూరి వీరబ్రహ్మంగారి మనవరాలైన ఈశ్వరీదేవి 14 ఏళ్ళ తపస్సు చేసిన అనంతరం కాల జ్ఞానం ప్రచారం చేస్తూ క్రీ.శ 1789లో సజీవ సమాధి పొందినట్లు భైరవానందస్వామి భక్తులకు వివరించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర -చీమకుర్తి : చీమకుర్తి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీడీవో ఆఫీసులో సమావేశ మందిరంలో ఆదివారం మండల పరిషత్ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా సంతనూతల పాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. రాజకీయాలకతీతంగా చీమకుర్తి మండలాన్ని అభివృద్ధి చేస్తానని బిఎన్ విజయకుమార్ అన్నారు. జిల్లా పరిషత్ నుంచి మన మండలానికి రావాల్సిన గ్రాటంటును తీసుకువచ్చి మన మండలంలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మన్నం రాజేశ్వరి ప్రసాద్, ఎంపీడీవో కే. రాఘవేంద్ర, మండల తహసిల్దార్ ఆర్.బ్రహ్మయ్య, మండల స్థాయి అధికారులు పంచాయతీ అభివృద్ధి అధికారులు ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్‌పై యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర -కంభం : ఆన్లైన్ బెట్టింగ్ బానిసైన యువకుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరికి ఆత్మహత్య చేసుకున్నసంఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. సమాచారం మేరకు మార్కాపురం మండలం బిరుదులు నర్వ గ్రామానికి చెందిన నరేంద్ర రెడ్డి (21) కంభం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య చేసుకున్నాడు. ముండేం తల తెగిపడి ఉంది. శనివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడే ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'కార్నివాల్'ను ఆదర్శంగా తీసుకోవాలి

- పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అభినందనీయం
- ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్
- నెక్స్ట్ జెన్ ఇంటర్నేషన్ స్కూల్లో ఆకట్టుకున్న 'కార్నివాల్' స్టాల్స్

విశాలాంధ్ర -ఒంగోలు : కార్నివాల్ కార్యక్రమాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. నగర పరిధిలోని కొప్పోలు సమీపంలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన 'కార్నివాల్' కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరితంగా జరిగింది. ఇందులో కేవలం నెక్సజెన్ విద్యార్థులే కాక ఇతర స్కూళ్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పాల్గొని మాట్లాడారు. నెక్స్ట్ జెన్ స్కూల్లో కార్నివాల్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ స్కూల్లో నాలుగో సారి ఈ కార్యక్రమం జరపడంపై హర్షం ఆయన వ్యక్తం చేశారు. నేను కూడా ఒక సారి కార్నివాల్ కార్యక్రమం ఎలా ఉటుంటుందో చూశాను. కొన్ని వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇందులో పాల్గొంటారు. ఇందులో వచ్చే ఆదాయాన్ని అనాధ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, బీద విద్యార్థులు చదువు సంధ్యలకు ఉపయోగిస్తారని నిర్వాహకులు సంకల్పించుకోవడం చాలా ఆనందకరం. ఇలాంటి కార్యక్రమాలు వల్ల పిల్లలలో సామాజిక బాధ్యత పెరుగుతుంది. అందరూ దీనిని ఆదర్శంగా తీసుకుంటారని ఆశిస్తున్నాను. కేవలం స్కూళ్లల్లో చదువుకోవడమే కాకుండా ఇలాంటి పనులు చేయడం వల్ల వారికి మంచి బాధ్యత తెలుస్తుంది. ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న నెక్స్ట్ జెన్ స్కూల్ డైరెక్టర్స్ అయినా డా. మురళీధర్ రెడ్డి, కె. శ్రీకాంత్ బాబు, అరవింద, శ్రీవిద్యలను అలాగే ప్రిన్సిపాల్ డా.ఆర్.ఎల్.వి.రమేష్ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను స్కూల్ నిర్వహకులు ఘనంగా సత్కరించారు. దామచర్ల వెంట నగర అధ్యక్ష మదన్, నాయకులు ఉన్నారు.

బలహీనవర్గాలకు అండగా సీపీఐ

సయ్యద్ యాసిన్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గం సిపిఐపార్టీ నియోజకవర్గ సమితి సమావేశం దర్శి చెంచయ్య భవన్లో ఆదివారం వజ్రాల సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీ అని ఈ పార్టీ దేశంలో బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ ఎన్నో పోరాటాలకు చేసి బడుగు బలహీన వర్గాలకు వారికి అండదండలుగా ఉంటూ డిసెంబర్ 20 తేదీ నుండి 25వ తేదీ వరకు శత దినోత్సవాలు జరుపుకుంటున్నామని, ఎన్నో పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయి కానీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రం బలహీన వర్గాలకు సేవ చేస్తూనే 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నా మని ఆయన అన్నారు. పార్టీని బలోపేతం చేయటమే ధ్యేయంగా మనమందరం పనిచేయాలని పార్టీలు బలంగా ఉంటే మనం ఆ గొడుగు కింద బలంగా ఉన్నట్టు. బడుగు బలహీన వర్గాలకు పార్టీ అండదండలకు ఉన్నది కాబట్టి శత దినోత్సవాలు జరుపుకుంటున్నది. నియోజకవర్గం స్థాయిలో ఉన్న అన్ని శాఖలు శత దినోత్సవం సందర్భంగా శాఖలో ఉన్న ప్రాంతాలలో తోరణాలు జెండాలు స్తూపాలకు రంగులు వేసి పార్టీకి త్యాగాలు చేసిన వారిని స్మరించుకొని శతదినోత్సవాలలోపాల్గొని జయప్రదం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. డిసెంబర్ 26వ తేదీ ఒంగోలులో జరిగే సభకు అన్ని మండల శాఖల నుండి జిల్లా తీర్మానం మేరకు పాల్గొనాలని, పాల్గొనే ముందు అన్ని శాఖల నుండి సభ్యత్వాలు కనీసం 50 నుండి 60 శాతం పూర్తి చేసుకుని వారి సభ్యత్వాలను జిల్లా కమిటీకి పంపించవలసిన అవసరం మండల శాఖ కార్యదర్శుల మీద ఉన్నదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతి శాఖ నుండి జిల్లా కార్యవర్గ సమావేశ తీర్మానం ప్రకారం అన్ని శాఖలు నడుచుకొని శాతదినోత్సవాలలో పాల్గొని డిసెంబర్ 26వ తేదీ ఒంగోలు తరలి వెళ్ళవలసి ఉన్నదని తెలిపారు. జనవరి 18వ తేదీ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో జరిగే శత దినోత్సవాలు ముగింపు భారీ సభకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జిల్లా కౌన్సిల్ సభ్యులు మండల కౌన్సిల్ సభ్యులు అందరూ పాల్గొంటారు అని వారితోపాటు రాగలిగిన వ్యక్తులు పాల్గొనే అవకాశం కూడా ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మౌలాలి, ప్రభాకర్ రావు, జి పి రామారావు, మోహన్ రావు, గులాం హుస్సేన్ , బాల్ రెడ్డి, కాసిం పీరా, పాలపర్తి మస్తాన్ ,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ రాజీలేని పోరాటం

విశాలాంధ్ర-సిఎస్ పురం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేసే ఏకైక సంఘం యూటీఎఫ్ సంఘం అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అన్నారు. ఆదివారం స్థానిక వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాలలో సి.ఎస్. పురం మండల యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం ఆ శాఖ అధ్యక్షులు నారిశెట్టి వెంకట రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ యూటీఎఫ్ పోరాట నేపథ్యం జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం గురించి వివరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయడం తగదని పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు.

షంషీర్‌కు అభినందనలు

విశాలాంధ్ర-మార్కాపురం : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెక్రటరీగా నియమితులైన సందర్భంగా డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీబేగ్‌ను ఆ పార్టీ నాయకులతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలుపుతున్నారు. అందులో భాగంగా ఆదివారం డాక్టర్ షంషీర్ఆలీబేగ్‌ను వైసీపీ ఇంటలిజ్యువల్ విభాగం రాష్ట్ర సెక్రటరీ మేడా బద్రీనాథ్, మునిసిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ, మునిసిపల్ కౌన్సిలర్ చాటకొండ చంద్ర, మైనార్టీ నాయకులు ఎస్‌కె ఉస్మాన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ విభాగం సభ్యులు బూదాల గురవయ్య, తర్లుపాడు మండల వైసీపీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, బొకె అందజేసి అభినందనలు తెలిపారు.

గ్రీన్ - బ్లూ - గ్రే - హైడ్రోజన్ల ఉత్పత్తి పెంపుపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : దేశం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 5 సంవత్సరాలలో గ్రీన్, బ్లూ మరియు గ్రే హైడ్రోజన్ల ఉత్పత్తి, ఉత్పత్తి కేంద్రాలు, ఉత్పత్తి పెంపుకు రాష్ట్రాలకు పరిశ్రమల ప్రోత్సహకాలు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి మరియు విద్యుత్ శాఖ సహాయక మంత్రి, శ్రీపాద్ ఎస్సో నాయక్ సమాధానం తెలిపినట్లు మాగుంట ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తెలిపిన వివరాలు ప్రకారం గాస్ నుండి ఉత్పత్తి చేసేదే గ్రీన్ హైడ్రోజెన్ అని, గాలి, సౌర శక్తి, జల విద్యుత్, పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి దీన్ని ఉత్పత్తి చేస్తారని మరియు శక్తి నిల్వ, రవాణా మరియు వివిధ రసాయన ప్రక్రియలకు దీన్ని ఉపయోగిస్తారని తెలిపారు. మిగతా రకాల హైడ్రోజన్ల కన్నా ఇది ఎక్కువ సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజెన్ నివేదిక ప్రకారం దేశంలో సాలీనా 6.5 మిలియన్ మెట్రిక్ టన్నుల హైడ్రోజెన్ ఉత్పత్తి చేయబడి వినియోగించ బడుచున్నదని, దేశం మొత్తంలో 20 కంపెనీలు వివిధ పరిమాణాలలో హైడ్రోజెన్ ఉత్పత్తి చేస్తున్నాయని తెలిపారు.

24గంటలో సమస్య పరిష్కారం

- ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే..చాయ్ 3.0
- ప్రజల నుండి వస్తున్న స్పందన
- కేఎస్ఎస్ సభ్యులు పనితీరు భేష్ అంటున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కనిగిరి : వార్డులలో ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకునుటకు ఎమ్మెల్యే చేపట్టిన చాయ్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తూ ఉండటంతో ప్రజల్లో స్పందన నెలకొంది. ఆదివారం చాయ్ 3.0 " కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి 9 వార్డ్ నందు చేపట్టిన కార్యక్రమంలో కుటుంబ సాధికార సమితి సభ్యుల ద్వారా ప్రజల సమస్యలను తాను తెలుసుకోవడం, సత్వర పరిష్కారం చూపించడం జరుగుతున్నాయి. 9వ వార్డులో ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకొని, వారి వివరాలను నమోదు చేసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, జంషీర్, వార్డు సభ్యులు సుబ్బయ్య తిరుపతయ్య కెఎస్ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే జరిమానాలు తప్పవు

మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య

విశాలాంధ్ర-మద్దిపాడు : హెల్మెట్ లేకుండా జాతీయ రహదారిపై ప్రయాణం చేస్తే నిర్మాణాలుహెల్మెట్ లేకుండా జాతీయ రహదారిపై ప్రయాణం చేస్తే జరిమానాలు విధిస్తామని మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య అన్నారు. ఆదివారం స్పెషల్ పార్టీ పోలీసులతో రోడ్డు ప్రమాదాలపై రోడ్డు ప్రమాదాలపై గుండ్లపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద సీతారాంపురం కష్టాలు వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాడు ఎస్ఐ వెంకట సూర్య మాట్లాడుతూ మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేసేవారు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణ చేపట్టాలని తెలిపారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని ఎస్సై వెంకట్ సూర్య తెలిపారు. లైసెన్సులు లేని వాహనం నడిపే వారికి జరిమానా దించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

జడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర - వెలిగండ్ల: వైయస్సార్ పార్టీ కార్యకర్తలకు పార్టీ సానుభూతిపరులకు పార్టీ అభిమానులకు అండదండలుగా వెన్నంటి ఉంటానని ప్రకాశం జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు జడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు, వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జడ్పిటిసి కార్యాలయంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండదండగా పార్టీ ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తాను కార్యకర్తకు వెన్నుదన్నుగా నిలుస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, చిలకల నారాయణరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

నందన మారెళ్ళ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో చోరీ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం నందన మారెళ్ళ గ్రామంలో కొండపై వెలసి ఉన్న బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో చోరీ జరిగినట్లు పూజారి ఇచ్చిన వివరాలు ప్రకారం ప్రతిరోజు యధావిధిగా ఉదయమే గుడికి రావడం జరిగిందని వచ్చేసరికి గుడి తలుపులు తెరిచి ఉన్నట్లు తెలుపుతూ విషయాన్ని కమిటీ సభ్యులకు పోలీసువారికి సమాచారం ఇచ్చినట్లుపూజారి తెలిపారు. పోలీసులు కూడా దేవస్థానము పరిశీలించారని తెలిపారు.

వీధి కుక్కలతో భయం భయం

- ప్రజలు వాహనదారులపై వెంటపడి దాడులు
- పట్టించుకోని అధికారులు,పాలకులు

విశాలాంధ్ర-పీసీపల్లి : కాలనీలోని కిరాణా షాపునకు వెళ్లాలంటే భయం! రోడ్డుపై నడవాలంటే ఆందోళన! నిత్యం వెళ్లే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సిందే! రాత్రి వేళ అయితే పరిస్థితి మరింత భయానకం! దీనికి కారణం వీధి కుక్కలే! నగరాలు, పట్టణాలు, గ్రామాలు.. ఇలా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఏ కుక్క కరిచినా ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. వీధి కుక్కలతో సమస్య లేకుండా చేసే బాధ్యత స్థానిక సంస్థలదే. ఈ విషయంలో సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే వారిలో కదలిక కనిపిస్తోంది. వీధి శునకాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎటు నుంచి శునకాలు మూకుమ్మడిగా దాడులకు పాల్పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ గ్రామంలో చూసిన వీధికుక్కలు గుంపులు గుంపులుగా వందల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ప్రధాన వీధులు, రహదారుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆయా మార్గాలలో రాకపోకలు సాగించే వారిపై మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్లపైకి రావాలంటే ప్రజలు వాహన దారులు భయపడుతున్నారు. ఎటు నుంచి వీధి శునకం తనపై దాడిచేస్తుందోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని మరీ రాకపోకలు సాగిస్తునారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

చిన్నారులపై దాడి : పాఠశాలకు వెళుతున్న చిన్నారుపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. శునకాల దాడిలో గాయపడిన చిన్నారులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు. ఇలాంటి ఘటనలతో చిన్నారులను ఒంటరిగా బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

వాహనదారులపై వెంటాడి మరీ దాడులు : మండలంలోని ప్రధాన రహదారులలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ రహదారిలో వీధి శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంటాడి మరీ దాడులకు పాల్పడు తున్నాయి. శునకాల దాడి నుంచి రక్షించుకునే క్రమంలో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు.

పిచ్చికుక్కలతో పెను ప్రమాదం : వీధుల్లో విచ్చలవిడిగా కుక్కలు పెరిగిపోవడం ఒక సమస్య అయితే ప్రస్తుతం పిచ్చికుక్కలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో పిచ్చిపట్టిన కుక్కలు సంచరి స్తున్నాయని ఎప్పుడు ఎలాంటి ప్రాణహాని జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి శునకాలు పెరిగిపోయి అవికాస్త వ్యాధుల బారిన పడడంతో ఇలాంటి ప్రమాద కరమైన దుస్థితి నెలకొంది ఆయా గ్రామాల వాసులు వాపోతున్నారు.

నిర్లక్ష్యం చేస్తే అంతే : ఏ కుక్క కరిచినా, అందులోనూ వీధి కుక్కలు అయితే తక్షణమే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. రేబిస్ వ్యాధి సోకితే నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. టంబిస్ లక్షణాలు ఉన్న కుక్కలు కరిచినప్పుడు వైరస్ ప్రభావం కేంద్ర నాడీ వ్యవస్థపై పడుతుంది. ముఖం, వెన్నెముక భాగాల్లో కరిస్తే వైరస్ నాడీ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. కాలు, తొడ, చేయి భాగాలపై కరిచినప్పుడు కొంత ఆలస్యంగా వైరస్ నాడీ వ్యవస్థను చేరుకుంటుంది. రేబిస్ లక్షణాలు బయటపడిన తర్వాత నయం చేయడానికి ఎలాంటి వైద్యం లేదు. రేబిస్ కారక లీసా వైరస్ కుక్కల్లోనే కాకుండా పిల్లులు, నక్కలు, గబ్బిలాల్లోనూ ఉంటుంది. ఏది కరిచినా వెంటనే టీటీ ఇంజక్షన్ చేయించుకోవాలి. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి గ్రామాల్లో కుక్కల బెడద నుండి కాపాడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఇరుముడులతో శబరిమలకు..అయ్యప్ప స్వాములు

విశాలాంధ్ర - మద్రిపూడి : అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన స్వాములు మద్రిపూడి శివాలయ ప్రాంగణంలో ఉన్నటువంటి అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం గురు స్వాములచే శాస్త్రోక్తంగా వేదమంత్రాలచే భక్తిశ్రద్ధలతో ఇరుముడులను కట్టించుకొని తమ మొక్కులను తీర్చుకునేందుకు శబరిమలకు బయలుదేరారు. అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన స్వాములందరూ మండలం రోజులపాటు(41) చన్నీటి స్నానమాచరించి ఉపవాసాలతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భజనలు చేస్తూ దీక్షను పూర్తిచేసుకున్నారు. ఇరుముడులతో స్వామి దగ్గరకు వెళ్లే రోజు గ్రామంలో స్వాములు అందరూ మేళతాళాలతో భాజా భజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు గ్రామంలోని దేవాలయాలలో బొడ్రాయి కి మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో అయ్యప్ప స్వాములు కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. ఊరేగింపుగా వస్తున్న అయ్యప్ప స్వాములకు గ్రామంలోని మహిళలు వారు పోసి హారతులు ఇచ్చి స్వాముల ఆశీస్సులు అందుకున్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్ - తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - మద్రిపూడి : మరిపూడి - పొదిలి ఆర్ అండ్ బి రహదారిలోని గుండ్ల సముద్రం చెరువు మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కూచిపూడి గ్రామానికి చెందిన పి. సుబ్బారెడ్డి అనే వ్యక్తి పొదిలిలో ట్రాక్టర్ బాగు చేయించుకొని ఇంటికి వస్తుండగా ఎదురు వైపు నుంచి మరో ద్విచక్ర వాహనం దారుడు వెళ్ళే క్రమంలో మలుపుల వద్ద అకస్మాత్తుగా ఒకదానికొకటి ఎదురుపడ్డాయి. ఆ సమయంలో ద్విచక్ర వాహనమును తప్పించే క్రమంలో ట్రాక్టర్ ను పక్కకు మళ్లించడంతో రోడ్డును ఆనుకుని లోతైన పొలాలు కావడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ఎవరికి గాయాలు లేకుండా ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు.

పిడతలను పరామర్శించిన వెన్నా హనుమారెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వెన్నా హనుమారెడ్డి ఆదివారం పిడతల నివాసానికి చేరుకొని ఆయన కుమారుడు, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డిని పరామర్శించి, సంతాపం తెలిపారు. అలాగే గిద్దలూరు నియోజక వర్గానికి పిడతల రాంభూపాల్ చేసిన సేవలను కొనియాడారు. పశ్చిమ ప్రాంతంలో సీనియర్ నాయకులుగా ఉన్న రాంభూపాల్ మృతి చెందడం ప్రజలకు తీరని లోటని ఆయన విచారం వ్యక్తం చేశారు.

శాలివాహన సత్రం చైర్మన్‌గా చాతిరాజుపల్లి మోహన్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-మార్కాపురం : దేశంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రంగా వర్ధిల్లుతున్న శ్రీశైలం శాలివాహన సత్రం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం శ్రీశైలంలో ఘనంగా జరిగింది. సత్రం నూతన అధ్యక్షులుగా చాతిరాజుపల్లి మోహన్ (మార్కాపురం), ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా నరసింహారావులతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సి హెచ్ మోహన్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పెద్దలందరూ అధ్యక్షులుగా తనను ఎన్నుకోవడం చాల ఆనందంగా ఉందన్నారు. సత్రం అభివృద్ధికి శాయుశక్తుల కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహరించిన ప్రతి ఒక్కరికీ మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలి వాహన అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బిక్షపతి, మార్కాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ సి హెచ్ అంజమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యుటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కందెర నాగరాజు, వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-సిఎస్‌పురం : యూటీఫ్ నూతన అధ్యక్ష ప్రధానకార్యదర్సులుగా కందెర నాగరాజు, కుండా వెంకటేశ్వర్లు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నూతనకౌన్సిల్ సమావేశం అధ్యక్షులు నారిశెట్టి వెంకటరామయ్య అధ్యక్షతన జరిగింది. నూతన మండల శాఖ గౌరవ అధ్యక్షులుగా నారిశెట్టి

వెంకట రామయ్య, సహాధ్యక్షులుగా షేక్ చాంద్ భాషా, ఎం.సత్యవతి, కోశాధికారిగా బి. వి. ఎస్. రమేష్, మండల కార్యదర్శిగా ఐ. కొండయ్య, జి.లక్ష్మీనారాయణ, పీ.ఎం. రసూల్, యల్. లక్ష్మీనారాయణమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా వి.సాంబశివరావు, జె. వెంకట్రావు, యం. వి.లక్ష్మమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి వెంటనే ఐ. ఆర్ ను ప్రకటించాలని, బోధ నేతల పనులు తొలగించి యాప్ల భారాల నుండి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని, హై స్కూల్ ప్లస్ లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఈ సందర్భంగా నూతన కమిటీ డిమాండ్ చేసింది.

రైల్వే ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా గస్తీ

అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బి.శైలేష్‌కుమార్

విశాలాంధ్ర-దొనకొండ: రైల్వే ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా తమ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారని గుంటూరు రైల్వే డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమీషనర్ బి.శైలేష్‌కుమార్ తెలిపారు. స్థానిక రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా ఆయన ఆదివారం సందర్శించి రికార్డులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల భద్రత కొరకు అవసరమైన చోట సరిపడా సిబ్బందిని నియమించి, సీసీ కెమెరా, బాడీ కెమెరా, డ్రోన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతో నిత్యం గస్తీ బలపరచటంతో డివిజన్ పరిధిలో గణనీయంగా నేరాలు తగ్గు ముఖం పట్టినట్లు తెలిపారు. ఈ సేవలను రద్దీగా ఉండే రైల్వే స్టేషన్‌లకు విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు స్టేషన్ పరిధిలో, రైలు బోగిల్లో దొంగలు, అనుమానితులు తారస పడితే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలంటూ సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో స్థానిక రైల్వే ఏఎస్ఐ వీరాంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

1500 మందికి ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర-ఒంగోలు : డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డా.అగర్వాల్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో స్థానిక సంతపేట సాయిబాబా దేవస్థానం నందు జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం నందు సుమారు 1500 మందికి ఉచిత కంటి పరీక్షలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిలుగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జనార్ధన్ రావు చేతుల మీదగా డీజేఆర్ ట్రస్ట్ వారి సహకారంతో అవసరమైన వారికి మందులు మరియు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జనార్ధన్ మాట్లాడుతూ డీజేర్ ట్రస్ట్ పేదలకు సేవా చేయడానికి ఏప్పుడు ముందు వుంటుందన్నారు. ఈరోజు చూపించుకున్న వారికి కంటి శుక్లాలు నిర్ధారించబడిన వాళ్ళకి ఎన్టిఆర్ వైద్యసేవ కార్డ్ ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు చేయబడును అన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ హాస్పిటల్ తరుపున డా.సాయి యశ్వంత్, డా.లక్ష్మీ శిరీష, వి.జయకుమార్ రెడ్డీ, దేవస్థానం నిర్వాహకులు చెంచల్ రావు, మరియు పార్టీ నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - పొదిలి : పొదిలి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్పమాల దీక్ష స్వాములుతో పాటు సకలమాలధారణ దీక్ష తీసుకున్న స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేయడం జరిగింది. కులమత బేధాలు లేకుండా మనమందరం ఒక్కటే అంటూ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టి మానవత్వం చాటుకున్నారు.

వివాహ వేడుకల్లో ఇమ్మానియేల్

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గన్నవరం గ్రామంలో డీలర్ జుట్టుకే కొండయ్య కుమారుడు డానియల్ కుమార్తె వివాహ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రేష్ట ఫౌండేషన్ అధ్యక్షులు తగరం ఇమ్మానియేల్ టిడిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గోన వెంకటయ్య, జేపీ రాజు, పల్లె పోగు యోహాన్ జార్జి పాస్టర్ గుంటయ్య యోహాన్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

పోతినేని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదే శ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల హరిదాసు మర్యాదపూర్వకంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో నిరంతరం నిబద్ధతతో పనిచేస్తున్న పోతినేని శ్రీనివాసరావు మరింత ముందుకు సాగుతూ, ఉన్నత పదవులు అధిరోహించాలని బత్తుల హరిదాసు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆనంద్ కృష్ణ, నరేష్, రత్నబాబు తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర-దుగ్గిరాల: తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం దుగ్గిరాలలో తెదేపా నాయకులు ఘనంగా నిర్వహించారు .రైలుపేట బోసు బొమ్మ సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరైన పోతినేని శ్రీనివాసరావు ముందుగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు మండల నాయకులు పుష్పగుచ్చాలను అందించి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్ద ప్రత్యేక పదార్థాలతో ఏర్పాటు చేసిన వంటకాలను నిరుపేదలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, పాల్గొన్నారు.

కేహెచ్‌ఐటీ కళాశాలలో ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: శివారులో నెలకొన్న కళ్లం హరనా ధరెడ్డి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ నందు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ మరియు ఐఓటీ రంగాలలో విద్యార్థులకి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇన్ఫోసిస్ కంపెనీ ఆధ్వర్యంలో మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు వివిధ నూతన ఆవిష్కరణలు పై అవగాహన నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ డా.మొవ్వ ఉమాశంకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ 3వ సంవత్సరం విద్యార్థులకు ఈ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనం అన్ని సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్ర పరికరాలతో కూడిన విజ్ఞాన సహకారాలతో కూడిన అవగాహన అందించారు. 25 మంది విద్యార్థులు సమూహం సభ్యులకు సాంకేతిక అంశాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. మొత్తం 150 మంది విద్యార్థులు ఈ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనంలో సాంకేతిక అంశాల పై అవగాహన పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కోరారు. పీజీఆర్‌ఎస్‌లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీల వివరాలు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

భక్తులకు అసౌకర్యాలు కలిగించొద్దు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక శ్రీనివాసరావుపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశాల మేరకు చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాల డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, తోట రామకృష్ణల ఆహ్వానం మేరకు దేవస్థానంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం దేవాలయంలో ఏర్పాటు చేయనున్న భోజనశాల శంకు స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిబాటలో భాగంగా దేవాలయాల అభివృద్ధి..భక్తుల సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

కండ్రికలో జనని సీడ్స్ ప్రత్తి ప్రదర్శన క్షేత్రం

విశాలాంధ్ర-ఫిరంగిపురం : మండలంలోని కండ్రిక గ్రామంలో రైతుల పొలాల్లో జననీ వారి జననీ-555 కంపెనీ ఆధ్వర్యంలో ప్రత్తి ప్రదర్శన క్షేత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ ప్రదర్శన క్షేత్ర కార్యక్రమానికి ప్రముఖ జోసిల్ కంపెనీ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జనని-555 బీజీ-2 రకం అధిక వర్షాలతో వచ్చే తెగుళ్ల సైతం తట్టుకొని గులాబీ రంగు పురుగు, చీడపీడలను తట్టుకొని మంచి పంటతో అధిక దిగుబడులను తెస్తుందని రైతులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. జనని-555 రకం ప్రతికూల వాతావరణంలో కూడా అధిక కాపుతో ప్రత్తి తీతకు అనుకూలంగా ఉందని జెట్టి శ్రీనివాసరావు అనే రైతు తన పొలంలో ఏర్పాటుచేసిన ప్రత్తి ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు తెలియజేశాడు.

కానిస్టేబుల్ నియామక పత్రాల జారీ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర- మంగళగిరి : ఈ నెల 16వ తేదీన కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం పరిశీలించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీఐపీ, వీవీఐపీ హాజరు నేపథ్యంలో సభా వేదిక వద్ద ఇన్నర్, ఔటర్ కార్డన్ బందోబస్తు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, ఏటీవీ రవికుమార్, ఏ.హనుమంతు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సత్కారం

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : జిల్లా గ్రంథాలయ సంస్థకు మహిళా ఛైర్మన్‌గా నియమింపబడిన భీమినేని వందనాదేవిని ఆమె స్వగృహంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఛైర్మన్‌కు వివరించారు. వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్‌గా ఉన్న జీపీఎఫ్ అమౌంట్‌ను ఉద్యోగి, కార్యదర్శి జాయింట్ అకౌంట్‌కు జమ చేయాలని, విద్యా అర్హత ఉన్న వారికి ఆఫీస్ సబార్డినేట్స్ నుంచి రికార్డ్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి కల్పించాలని, రికార్డ్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-3 జిల్లా గ్రంథాలయాధికారులుగా పదోన్నతి కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులలో ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. వేముల విజయ్ కుమార్, మస్తాన్‌రావు, నాగిరెడ్డి, చిన్నపరెడ్డి, కనకదుర్గ, తాటి విజయకుమార్, పఠాన్ నజీరుద్దీన్ ఖాన్, సత్య శిరీష పాల్గొన్నారు.

వీధి దీపాలన్నీ వెలిగేలా పర్యవేక్షణ వ్యవస్థ : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలన్నీవెలిగేలా విభాగాధిపతులు, సీనియర్ అధికారులతో పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ విధులు కేటాయించబడిన అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, నగరంలోని ప్రతి అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)ల పరిధి వారీగా వీధి దీపాల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు సంబంధిత విభాగాధిపతులు, సీనియర్ అధికారులకు ప్రత్యేకంగా పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించామని తెలిపారు. వీధి దీపాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతతో విధులు నిర్వహించాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు స్పష్టం చేశారు. పనిచేయని వీధి దీపాలను తక్షణమే మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట్ల కొత్త లైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పొన్నూరు శాసనస భ్యులు, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జన్మదినం సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర స్థానిక నిర్మల్ హృదయ్‌లో వృద్దులకు పండ్లు పంపిణీ చేశారు. అనం తరం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ధూళిపాళ్ళ నరేంద్ర తన రాజకీయ జీవితం ద్వారా రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఎంతటి సమస్య ఎదురైనా దైర్యంగా పోరాడగలిగే సమర్ధుడని కొనియాడారు. రైతు బాంధవుడు.. సంగం డెయిరీ ద్వారా పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. సంగం డెయిరీని రూ.2 వేల కోట్ల టర్నోవర్‌కి చేర్చిన ఘనత నరేంద్రదేనని అన్నారు.

బార్లు తెరుచుకుంటున్న బార్లు

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టణంలో మందు బాబులకు కిక్కిచ్చేందుకు బార్లు తెల్లవారుజామునే బార్ల తెరుచుకుంటున్నాయి. సమయపాలన లేకుండా యదేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. మద్యం విక్రయాలతో పాటు బెల్ట్ షాపులు పట్టణంలో పుట్టగొడుగుల్లాగా వెలిశాయి. హోటల్స్‌లో టీ విక్రయిస్తున్నట్లు మద్యం విక్రయిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నివాస ప్రాంతం ఉన్న తాడేపల్లి పట్టణం, రూరల్ పరిధిలో, విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ద్వారా మద్యం అమ్మకాలు ఏమిటని అడిగిన కూడా అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పశ్చిమ టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. నేడు 20 మంది అర్హులైన పేదలకు మొత్తం రూ.31 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

క్రీస్తు చూపిన బాటలో నడవాలి: దేగల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్రీస్తు చూపిన సర్వ మానవ సమానత్వం, శాంతి, సహనం, ప్రేమ, కరుణ సందేశం అందించి ఆచరించిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ)చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. స్థానిక శారదా కాలనీ 31వ లైన్‌లోని షెకీనా మినిస్ట్రీస్ చర్చి నందు దేగల యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ విజయ్ కుమార్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ 100 మంది క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం దేగల ప్రభాకర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పుట్టిన పవిత్ర రోజు క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. అందరిపట్ల కృతజ్ఞత, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని కోరారు. క్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసుకోవాలని, అందరూ దేవుడి ప్రేమతో మెలగాలన్నారు. క్రీస్తు లోక రక్షణ కోసం రక్తం చిందించారన్నారు. క్రీస్తు బోధనల్లో ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడడం, సహాయం చేయడం ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో జీవితం గడిపే విధంగా క్రీస్తు బోధనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ డాక్టర్ అన్వేష్ కుమార్, దేగల యూత్ జిమ్ సునీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పదవి కాదు... బాధ్యతే గొప్పది: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి 20వ డివిజన్ కమిటీ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే ప్రతిఒక్కరి ప్రధాన బాధ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. గతంలో కమిటీలకు పరిమిత పాత్ర మాత్రమే ఉండేదని, ఇకపై మాత్రం ప్రతి కార్యకర్త, ప్రతి ఇంచార్జ్‌కు నిరంతర బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ప్రతి రోజు ప్రజల మధ్య ఉండే రాజకీయమే తమ లక్ష్యమని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో ప్రతిరోజూ 'పండగ వాతావరణం' కనిపించేలా పనిచేయాలన్నారు. 20వ డివిజన్‌లో గతంలో టీడీపీ జెండా ఎగరకపోయినా, రానున్న రోజుల్లో తప్పకుండా ఎగరాల్సిందేనని ధీమా వ్యక్తం చేశారు. వ్యక్తులు కాదు, పార్టీ ముఖ్యం అన్నదే తమ సిద్ధాంతమని చెప్పారు. కార్యకర్తల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు ప్రతి బుధవారం 'కార్యకర్తల రోజు'గా ప్రత్యేకంగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ప్రతి డివిజన్‌లో ప్రతి నెల తప్పనిసరిగా సమావేశం నిర్వహించాలని, అందులో ఐదు అంశాల అజెండాతో తీర్మానాలు చేసి తనకు సమర్పించాలని సూచించారు. ఈ ఐదు అంశాల్లో రెండు పూర్తిగా కార్యకర్తలకు సంబంధించినవై ఉండాలని, మిగతా మూడు డివిజన్ అభివృద్ధికి సంబంధించినవై ఉండాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి నెల రోజుల గడువు ఇచ్చి, తదుపరి సమావేశంలో పురోగతిని సమీక్షిస్తామని పేర్కొన్నారు. సీనియర్ల అనుభవం, యువత ఉత్సాహం రెండింటి సమన్వయమే చంద్రబాబు నాయుడు ఫార్ములా అని, అదే విధానాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. క్లస్టర్ ఇంచార్జ్‌లు సమన్వయ బాధ్యత తీసుకుని, అంతర్గత సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త తాను తెలుగుదేశం పార్టీ కార్యకర్తననే గర్వంగా భావించాలని, ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లి అనిల్, షేక్ ఇమ్రాన్, తన్నీరు కృష్ణ, రఫీ, రబ్బానీ, ఆదంసా, చెన్నం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అనేక వ్యాధులకు మూలం జీర్ణాశయమే

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : మన శరీరంలో అనేక వ్యాధులకు మూలం జీర్ణాశయమేనని ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ బి.సాయి కృష్ణ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్.హెచ్.ఓ సమావేశ మందిరంలో సర్వీస్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'జీర్ణాశయ వ్యాధులపై శాస్త్రీయ అవగాహన సభ- ఉచిత వైద్య సలహా శిబిరం'ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ బి. సాయికృష్ణ మాట్లాడుతూ సమాజంలో నేడు చాలా మంది గుండె, మెదడు సంబంధ వ్యాధులపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారని, ఆ అవయవాల వ్యాధులకు కారణమవుతున్న జీర్ణాశయ వ్యాధులపై దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. మనం తీసుకునే ఆహారం, అలవాట్లపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారని అన్నారు. నేడు మనం సహజ సిద్ధ ఆహారాన్ని తీసుకోవడం మాని... కృత్రిమ పద్ధతుల్లో తయారు చేసిన.. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం జరుగుతుందని, అంతేగాక ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విచక్షణారహితంగా మందులు వాడటం జరుగుతోందన్నారు. వీటివల్ల జీర్ణాశయంలోని మంచిని కలుగజేసే బ్యాక్టీరియా నశించిపోయి వ్యాధుల కారక ప్రమాదకర బ్యాక్టీరియా పెరిగిపోతుందని అన్నారు. ఈ బ్యాక్టీరియా అనేక వ్యాధులకు కారణమవుతుందని, నెలల తరబడి శరీరంలో యాసిడ్‌ను తగ్గించే మందులు వాడటం ఏమాత్రం మంచిది కాదని హెచ్చరించ్చారు. దీని వల్ల ఆహారం అరుగుదలలో అనేక మార్పులు వస్తాయన్నారు. జీర్ణాశయంలో యాసిడ్ తగ్గిపోవడం వల్ల అనేక ప్రమాదకర సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, మంచి బ్యాక్టీరియా నశించిపోవడం, హానికర బ్యాక్టీరియా పెరుగుదలకు కారణమవుతుందన్నారు. అందువల్లనే వైద్యుని సలహా లేకుండా ఎలాంటి మందులు వాడడం మంచిది కాదని, అలా వాడితే మన జీర్ణాశయమును మనమే పాడు చేసుకుని వ్యాధులను కొని తెచ్చుకున్నట్లు అవుతుందన్నారు. మద్యపానం చేసేవారిలో లివర్ వ్యాధులతో పాటు ప్యాంక్రియాటిక్ వ్యాధులు పెరిగిపోతున్నాయని, మనం తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా, మద్యపానం ధూమపానం వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండడం వల్ల మన శరీరంలోని ప్రతి అవయవాన్ని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చునన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంపు చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ నేటి ప్రజలు ఆరోగ్యం పరిరక్షణపై తప్పక దృష్టి పెట్టాల్సిన అవసరం వచ్చిందన్నారు. వ్యాధుల నిర్ధారణకు, చికిత్సకు అయ్యే ఖర్చును సామాన్యులు భరించలేనంతగా పెరిగిపోయినందున ఆరోగ్య పరిరక్షణ చర్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ సేవ కుమార్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఎంత మంది ఆరోగ్యంగా ఉంటే అంతగా ఆ కుటుంబం అభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రతి వ్యక్తికి ఆరోగ్యం ప్రధాన అంశం కావాలని, వ్యాధుల నిరోధంలో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ అవగాహన కలిగి ఉండినపుడే అదే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య, ఎస్ హెచ్ ఓ మేనేజర్ పి.నిర్మలరాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మేకల రామారావు, ఎన్. సాంబశివరావు, చావా శివాజీ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల జాబిత రైతులకు అందజేత

విశాలాంధ్ర - రేపల్లె : బాపట్ల జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు బాధితులకు సంబంధించిన భూములను(22) ఎ నిషేధిత భూముల జాబితాలో గల రైతుల పేర్లను తొలగించుచూ బాపట్ల జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను రేపల్లె తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు సంబంధించిన రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు ఆరే రాంబాబు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్లాప్రగడ పాల్గొన్నారు.

విశాలాంధ్ర

బాపట్ల జిల్లా

కరాటేలో కొల్లూరు విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కొల్లూరు : అమరావతి నేషనల్ కరాటే చాంఫియన్ షిప్‌లో భాగంగా కొల్లూరు విద్యార్థులు రాణించినట్లు ఫోర్ ఫ్రంట్ పాఠశాల డెరెక్టర్ నవీన్ పాల్ తెలిపారు. ఆదివారం గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలలో ఫోర్ ఫ్రంట్ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థిని, విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, 6గురు గోల్డ్ మెడల్, 6 గురు సిల్వర్ మెడల్, ఒక విద్యార్థి కాంస్య పతకం గెలుపొందారాన్నారు. పోటీలలో పాల్గొన్న 13 మంది విద్యార్థులను, కరాటేలో శిక్షణ ఇచ్చిన మాస్టర్ పులివర్తి సోమయ్యను పాఠశాల డైరెక్టర్ టి. నవీన్ పాల్, ప్రిన్సిపాల్ అనిత కుమారి రాజన్‌లు అభినందించారు.

నామ్ రహదారి విస్తరణకు నిధులు మంజూరు

◆భూసేకరణ నిధుల చెల్లింపునకు ప్రభుత్వ ఉత్తర్వులు

◆మంత్రి గొట్టిపాటి చొరవతో ముందడుగు

◆ఏల్చూరు వద్ద అండర్ పాస్ ఏర్పాటుకు వేడుకోలు

విశాలాంధ్ర-సంతమాగులూరు: ఎట్టకేలకు నార్కెట్‌పల్లి- అద్దంకి - మేదరమెట్ల (నామ్) రహదారి విస్తరణ పనులకు మార్గం సుగమం అయింది. ఈ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లుగా భూసేకరణకు అవసరమైన నిధుల మంజూరులో జాప్యం ఏర్పడింది. ఈ కారణంగా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం,గోపాలపురం గ్రామాలతో పాటు సంతమాగులూరు మండలం పరిధిలోని ఏల్చూరు గ్రామాల వద్ద రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే అత్యంత కీలకమైన ఈ మార్గంలో ప్రమాదకర మలుపుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు వివరించామన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీఎం నామ్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణకు నిధులు కేటాయించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి గొట్టిపాటి చెప్పారు.

రూ.3.44కోట్లు మంజూరు..

నామ్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణకు రూ.3.44 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈనెల 10న ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రహదారి విస్తరణ కోసం మంజూరైన నిధులను త్వరలోనే చక్రాయపాలెం, కలవకూరు, గోపాలపురం, ఏల్చూరు గ్రామాల పరిధిలో భూసేకరణ నిమిత్తం రైతులకు చెల్లించి, రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రహదారి విస్తరణ పూర్తైతే ప్రయాణికులకు మరింత సురక్షితమైన ప్రయాణం, ఆయా ప్రాంతాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

అండర్ పాస్ నిర్మించాలని వేడుకోలు..

నామ్ రహదారి విస్తరణలో భాగంగా ఏల్చూరు వద్ద అనేక మలుపులు ఉన్నాయి. గత పదేళ్లలో రోడ్డు ప్రమాదాల బారినపడి అకాల మరణం చెందిన వారు సుమారు 50మందికి పైమాటే. ప్రధానంగా సంతకొట్టు, మాబునగర్, కస్తూర్బాగాంధీ బాలికల వద్ద మలుపుల్లో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ముఖ్యంగా 500మంది విద్యార్థులు సంతకొట్టు వద్ద రోడ్డు క్రాస్ చేసి అవతలి వైపు ఉన్న హైస్కూలు కు రోజూ వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు కావడంతో అండర్ పాస్ నిర్మాణం కూడా చేపట్టాలని పలు సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి గొట్టిపాటికి ఏల్చూరు ప్రజానీకం విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై మంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

చీరాల ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఉద్యమం

☞ డిపో మేనేజర్ శ్యామల మొండి వైఖరి విడనాడాలంటూ ధర్నా

☞ జేఏసీ నేతల ఆగ్రహం కుసుమకుమారి అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్

☞ ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి : ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర - చీరాల టౌన్ : ఆర్టీసీ కండక్టర్ సజ్జ కుసుమకుమారిపై విధించిన సస్పెన్షన్ ఉద్యోగ నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్‌ల్ దుయ్యబట్టారు. ఆదివారం స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం సహేతుకంగా లేదని విమర్శించారు. అక్రమంగా విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా జేఏసీ జిందాబాద్, ఉద్యోగ సంఘాల ఐక్యత వర్ధిల్లాలి, అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి, మేనేజ్‌మెంట్ ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి, యూనియన్ పక్షపాత వైఖరి విడనాడాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహిళా కండక్టర్‌పై తీసుకున్న చర్యలు మహిళా ఉద్యోగుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉన్నాయని నాయకులు నినదించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డబ్ల్యు ఎఫ్ సీనియర్ నాయకులు బొమ్మిడి శ్రీనివాసరావు, ఏపీ జేఏసీ అమరావతి, బాపట్ల జిల్లా మహిళా చైర్‌పర్సన్ రజని, సీఐటీయూ సీనియర్ నాయకులు మేడా వెంకటరావు పాల్గొని మేనేజ్‌మెంట్ తీరు ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. డిపో మేనేజర్ జంజనం శ్యామల వ్యవహారం మొండిగా ఉందని సమస్యను పరిష్కరించే దిశగా కాకుండా ఉద్యోగులపై ఒత్తిడి పెంచే విధంగా వ్యవహరిసున్నారని ఆరోపించారు.మహిళా ఉద్యోగి కుసుమ కుమారిపై విచారణ లేకుండా సస్పెన్షన్ విధించడం మేనేజ్‌మెంట్‌లోని పక్షపాత ధోరణికి నిదర్శనమని ఉద్యోగ సంఘాల నేతలు చెప్పారు. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉండగా, సస్పెన్షన్ వంటి కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాలు ఇలానే కొన సాగితే ఉద్యమం చేస్తామని రాష్ట్ర స్థాయిలో పోరాటాలకు సిద్ధమని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

అశోక్ కుమార్‌ను కలిసిన ఏల్చూరు నేతలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌ను ఏల్చూరుకు చెందిన పలువురు నేతలు పిడుగురాళ్లలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సంతమాగులూరు ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ ఇప్పల ముసలారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల21న జరిగే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలకు చింతలపూడికి ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. అనంతరం అశోక్ కుమార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈకార్యక్రమంలో నేతలు బలుపునూరి వెంకటరెడ్డి, రమణారెడ్డి, మేడా అంజయ్య, చిలకల సుబ్బారెడ్డి, వెన్నపూస నరసింహారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అడవులదీవి ఎస్ఐ బత్తుల బాబురావు సూచించారు.బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నో-యాక్సిడెంట్ డే సందర్భంగా ఆదివారం అడవులదీవిలో వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై ఎస్ఐ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు.వాహనదారులు తమ వాహనాలను మితమైన వేగంతో నడపాలని హితవు పలికారు.అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని ఆయన హెచ్చరించారు. వాహనదారులందరూ అప్రమత్తంగా ఉండి ప్రమాద రహిత ప్రయాణానికి సహకరించాలని ఎస్ఐ కోరారు.

అనన్య ఓణీల వేడుకల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య

విశాలాంధ్ర - వేటపాలెం : దేశాయిపేటలో చీరాల నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు వెంగళ భరత్‌బాబు బ్రహ్మణి దంపతుల కుమార్తె అనన్య ఓణీల వేడుక ఆదివారం ఘనంగా జరిగింది శుభకార్యానికి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆయన ధర్మపత్ని మద్దులూరి బాలకొండమ్మ హాజరై అనన్యను ఆశీర్వదించారు. వ్యక్తిగత ఆనందాల్లోనూ భాగస్వాములవడం పట్ల ప్రజలందరూ ఎమ్మెల్యేని ఆరాధన భావంతో కొనియాడారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధన్‌రావు మండల టీడీపీ అధ్యక్షులు గుత్తి రామాంజనేయులు. పిఎసిఎస్ చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు. ఎంపీడీవో ఎం.రాజేష్ బాబు. పంచాయతీ సెక్రెటరీ పర్ణం పూర్ణ కుమారి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పేదల దాహార్తి తీరుస్తున్న నిజామ్

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : బాపట్ల నియోజకవర్గ యువత అధ్యక్షుడు నిజామ్ బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేసే సేవలు ఆదర్శంగా తన పనితనం చేస్తున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర అందరి దాహార్తి తీర్చటానికి తన ఫౌండేషన్ ద్వారా అందరికి మంచినీటిని అందిస్తున్నారు. నిజామ్ రాజకీయ గురువైన వేగేసిన నరేంద్ర వర్మ రాజును ఆదర్శంగా తీసుకొని చందోలు గ్రామంలో ఎస్టీ కాలనీలో నీరు లేక పోవడం తో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు. విషయం తెలుసు కున్న నిజామ్ నీటి కష్టాల్లో ఉన్న ప్రజలు ఉచితంగా దాహార్తి తీరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలోబాపట్ల పార్లమెంట్ మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ జునేద్,జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు బీమా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీ వ్యవసాయ రైతులకు ఈ క్రాప్ పీఎంఎఫ్‌బీవై ఇన్సూరెన్స్ గురించి రైతు భరోసా అధికారి అనపర్తి హరీష్ పలు సూచనలు చేశారు. డిసెంబర్ 15వ తేదీ నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని ఆర్ తెలిపారు. వ్యవసాయ రైతులు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని మీ సేవలో సిఎస్సి సెంటర్ నందు ఇన్సూరెన్స్ అప్లై చేసుకోవచ్చు అన్నారు. ఇన్సూరెన్స్ చేపించుకున్న వ్యవసాయ రైతులకు ఏదైనా సందర్భంలో పంట నష్టం జరిగినచో ఇన్సూరెన్స్ ఇతర పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులకు ఏమైనా సందేహాలు సలహాలు తెలియజేయాలంటే ముక్తేశ్వరం పంచాయతీ రైతు భరోసా కేంద్రంలోని సంప్రదించాలని తెలిపారు.

నేడు స్వామిత్వ గ్రామసభ

విశాలాంధ్ర - జె.పంగులూరు : సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామమునందు స్వామిత్వ గ్రామసభ నిర్వహించనున్నట్లు మండలం అభివృద్ధి అధికారిని కత్తి స్వరూప రాణి తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు గ్రామ ప్రజలందరూ గ్రామసభకు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ బిల్లులు పెంచం: మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు పెంచేది లేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం అద్దంకిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఐదు ఏళ్ల పాలనలో 9సార్లు విద్యుత్ బిల్లులు పెంచి మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపిందన్నారు. విద్యుత్ రంగాన్ని ఆదాయం వ నరుగా చూడకుండా ప్రజలపై భారాలు మోపకుండా చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. రాష్ట్రంలో లో వోల్టేజీ సమస్య లేకుండా ప్రజలకు మెరుగైన విద్యుత్తు అందిస్తున్నామన్నారు. అద్దంకిలో నూతనంగా 2వేలు విద్యుత్ పోల్స్ వేసామన్నారు.3 విద్యుత్ సబ్‌స్టేషన్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రపంచంలో అన్ని కులాలు మతాలు జరుపుకునే పండుగ ఏదైనా ఉందంటే అది క్రిస్మస్ పండుగ ఒక్కటేనని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన అద్దంకిలోని కట్ట కింద పాలెం సెంటినరీ టౌన్ బాప్టిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ కేకును కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కుటుంబాలు సంతోషంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఏలూరి ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - కారంచేడు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో కారంచేడు మండలం కేంద్రంలోని యార్లగడ్డ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, నోవా అగ్రిటెక్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కారంచేడు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మహిళలకు పురుషులకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్ల ద్వారా రక్త పరీక్షలు బీపీ పరీక్షలు షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించారు. క్యాంపుకు మొత్తం 425 మంది హాజరుకాగా 105 మందికి శస్త్ర చికిత్సలకు నిర్వహించాలని వైద్యులు సూచించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ పెద్దలు ప్రజలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమలశెట్టి శ్రీహరి, నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్,ఏపీ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కృష్ణారావు లు మాట్లాడారు కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి గత 15 ఏళ్లుగా రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే ఏలూరి వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిబిరాల్లో కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచిత కళ్లజోడులు, శస్త్రచికిత్స అవసరమైన రోగులకు మెరుగైన వైద్యం అందేలా ఏర్పాట్లు చేయడం ఎమ్మెల్యే ఏలూరి సేవ నిరతికి నిదర్శనం అన్నారు. పోతిన ఉదయ్ భాస్కర్, సర్పంచ్ బాలిగా శివ పార్వతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ యార్లగడ్డ రత్తయ్య చౌదరి, కొత్తగొర్ల శ్రీరాములు, కంభంపాటి సరేంద్ర , పోతిన నాగేశ్వరావు, మైలా బ్రహ్మయ్య , దగ్గుబాటి చౌదరి, రాయనీడి హనుమంతరావు, రామకృష్ణ, శాంతయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, పోతిన రాజేంద్ర ప్రసాద్, కోసరాజు సురేంద్ర, ఖాసీం, బంగారు బాబు, పూర్ణయ్య, బ్రహ్మాజీ, చంద్రశేఖర్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

పరమానందకుమార్,దోవా రమేష్ రాంజీలకు బీఆర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న పురస్కారం

విశాలాంధ్ర - కర్లపాలెం : దళిత జాతి అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తూ కొన్ని దశాబ్దాలుగా దళిత క్షేమం కోసం పాటుపడుతున్న కర్లపాలెం మండలం అంబేద్కర్ సేవా సమాజం గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానంద కుమార్‌కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశిష్ట సేవ పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. గుంటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దళిత రాష్ట్ర నాయకుడు మల్లెల వెంకటరావు గోళ్ళ అరుణకుమార్ చేతుల మీదగా పరమానందకుమార్‌కు ఈ విశిష్ట పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో దళితుల అభ్యున్నతి కోసం విశేషంగా కష్టపడుతూ వారి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న పరమానందకుమార్‌ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశిష్ట సేవా పురస్కారంకు ఎంపిక చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన దళిత నాయకులు ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పురస్కారం అందుకున్న పరమానంద కుమార్‌ను పలువురు నాయకులు అభినందించారు.

బీఆర్ అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు

విశాలాంధ్ర - రేపల్లె : గత 20 సంవత్సరాలుగా పాత రేపల్లె తాలూకా ప్రాంతంలో రేపల్లె డివిజన్ దళిత అంబేద్కర్ యువజన సమాఖ్య అధ్యక్షులుగా మాల మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అనేక సాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న రమేష్ రాంజీ సేవా రత్న అవార్డు అందుకున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జైభీమ్ రావ్ భారత్ పార్టీ తరపున రేపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన న్యాయవాది దోవా రమేష్ రాంజీ కు ఆదివారం గుంటూరులో నిర్వహించిన మాలల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు తో మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్, మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, చేతుల మీదగా ప్రధానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతి ఔన్నత్యం కోసం కృషి చేస్తున్నటువంటి వ్యక్తులను సత్కరించడంలో భాగంగా రమేష్ రాంజీ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. అవార్డు గ్రహీత రమేష్ రాంజీ మాట్లాడుతూ అంబేద్కర్ పేరిట అవార్డును అందుకోవడం సమాజ హితం పట్ల నాపై మరింత బాధ్యతను పెంచుతుందని, అవకాశము ఉన్నంత వరకు దళిత జాతి అభ్యున్నతి కోసం పాటుపడతానని పేర్కొన్నారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల న్యాయవాదులు, దళిత సంఘాల ప్రతినిధులు, రమేష్ రాంజీ కి అభినందనలు తెలియజేశారు.

కోటి సంతకాల ర్యాలీ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బాపట్ల పట్టణంలో కోటి సంతకాల పుస్తకాల తరలింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు షేక్ మౌలాలి ఆదివారం తెలిపారు. బాపట్ల పట్టణంలోని డీఎం పల్లి వైయస్సార్ విగ్రహం వద్ద నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పీఏసీ సభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు మేరకు నాగర్జున అధ్యక్షతన నిర్వహించబడుతుందన్నారు.డీఎం పల్లి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం చీరాల రోడ్డు వరకు పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొననున్నట్లు తెలిపారు.మెడికల్ కాలేజీని ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిర్మించాలని డిమాండ్ చేస్తున్న ఈ ఉద్యమానికి కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాలు, మహిళా, యువజన విభాగాలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని షేక్ మౌలాలి కోరారు.

వరి ధాన్యం కొనుగోలు



విశాలాంధ్ర - బల్లికురవ : బల్లికురవ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నేటి నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అగ్రికల్చర్ ఏవో శ్రీనివాసులు తెలిపారు. బల్లికురవ మండలంలో ముక్తేశ్వరం కొప్పెరపాడు అంబడిపూడి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశామని తెలిపారు. అగ్రికల్చర్ ఏవో రైతులకు వివరిస్తూ వరి ధాన్యం సొసైటీ తరుపున అమ్మదలుచుకున్నవారు ఈ క్రాప్ చేయించుకొని ఉండాలని అలాగే రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలని తెలిపారు. అలాగే వరి ధాన్యం తేమశాతం 17 శాతం తక్కువగా ఉండాలని రైతులు వరి దాన్యం తీసుకొని వచ్చే ట్రాక్టర్‌కు జిపిఎస్ అమర్చుకొని ఉండాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-కొల్లూరు : ఐదు దశాబ్ధాల క్రితం విద్యను అభ్యసించిన పదో తరగతి విద్యార్థులు అపూరూప జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఆదివారం కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో 1975 - 76లో కొల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యా ర్థుల సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి మధుర జ్ఞాప కాలను నెమరువేసుకున్నారు. గురువులనుసత్కరించారు.

పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కోరారు. పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవళికి అనుసరణీయం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవళికి అనుసరణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.మండలంలోని సంగుపాలెంలో క్రీస్తు నిరీక్షణ ప్రార్థన మందిరం, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరీ యానెట్ సాపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీస్తుబోధనలు నేటి ప్రపంచానికి అవసరమన్నారు.మానవాళికి ప్రేమ, దయ, కరుణ పంచిన మహనీయుడు యేసుక్రీస్తు అని అన్నారు. కుల, మత వర్ణ విభేదం లేకుండా సేవా భావంతో మెలగడమే క్రైస్తవమన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ భూపతిరావు, రాష్ట్ర నాటక అకాడమీ నెంబర్ ఆంధ్రయ కోమలి సొసైటీ చైర్మన్ ఉయ్యూరు వెంకటేశ్వరరావు, మండల జనరల్ సెక్రెటరీ లక్ష్యం, మండల జనరల్ సెక్రెటరీ వెంకటపతి రాజు, మాజీ మండల ప్రెసిడెంట్ సాంబమూర్తి రాజు, బాపట్ల పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా కార్యదర్శి పల్లం సరోజిని, బాపట్ల నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు సయ్యద్ నిజాం, దీన బాబు, బర్మా జాన్ బాబు, మహిళా నాయకురాలు నీలా సరోజిని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతినేని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదే శ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల హరిదాసు మర్యాదపూర్వకంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో నిరంతరం నిబద్ధతతో పనిచేస్తున్న పోతినేని శ్రీనివాసరావు మరింత ముందుకు సాగుతూ, ఉన్నత పదవులు అధిరోహించాలని బత్తుల హరిదాసు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆనంద్ కృష్ణ, నరేష్, రత్నబాబు తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర-దుగ్గిరాల: తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం దుగ్గిరాలలో తెదేపా నాయకులు ఘనంగా నిర్వహించారు .రైలుపేట బోసు బొమ్మ సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరైన పోతినేని శ్రీనివాసరావు ముందుగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు మండల నాయకులు పుష్పగుచ్ఛాలను అందించి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్ద ప్రత్యేక పదార్థాలతో ఏర్పాటు చేసిన వంటకాలను నిరుపేదలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీపీ షేక్ జబీన్,మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి,రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు,రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ తాళ్ల అశోక్ యాదవ్,డీసీ చైర్మన్ గొర్నేని అనిల్,మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్,ఎంపీటీసీ సభ్యురాలు వాసిరెడ్డి లక్ష్మి, మండల నాయకులు దేవరపల్లి చంటి,బుస్సా నాగరాజు, ఎండి జలాలుద్దీన్,పర్వతనేని హర్ష, నందిపాటి జోగారావు, మన్నెం అశోక్, జూపూడి వెంకటేశ్వరరావు, గరిక శ్రీను,గోగం నాగేశ్వరరావు, పోసాని అప్పారావు,సుంకరి బిట్టు, అన్నాబత్తుని కళ్యాణ చక్రవర్తి,ఉన్నం బాబురావు, చిలువూరు శేషగిరి,చిలువూరు ఏసుపాదం,మెగావత్ శంకర నాయక్,ఎద్దు ప్రసాద్,కోనంగి శంకర్,కేసంనేని వాసుబాబు,ఉన్నం వెంకయ్య,పసుపులేటి వరదరాజులు,బొజ్జ బాలు యాదవ్,పాటిబండ్ల కిరణ్,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేహెచ్ఐటీ కళాశాలలో ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: శివారులో నెలకొన్న కళ్లం హరనా థరెడ్డి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ నందు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ మరియు ఐఓటి రంగాలలో విద్యార్థులకి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇన్ఫోసిస్ కంపెనీ ఆధ్వర్యంలో మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు వివిధ నూతన ఆవిష్కరణలు పై అవగాహన నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ డా.మొవ్వ ఉమాశంకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ 3వ సంవత్సరం విద్యార్థులకు ఈ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనం అన్ని సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్ర పరికరాలతో కూడిన విజ్ఞాన సహకారాలతో కూడిన అవగాహన అందించారు. 25 మంది విద్యార్థులు సమూహం సభ్యులకు సాంకేతిక అంశాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. మొత్తం 150 మంది విద్యార్థులు ఈ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనంలో సాంకేతిక అంశాల పై అవగాహన పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డాక్టర్ సతీష్, డాక్టర్ రత్నం, కళాశాల ఉపాధికల్పన అధికారి డాక్టర్ పిఎల్ మాధవ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీఎర్ఎస్‌ను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కోరారు. పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీల వివరాలు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

భక్తులకు అసౌకర్యాలు కలుగనీయొద్దు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక శ్రీనివాసరావుపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశాల మేరకు చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాల డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, తోట రామకృష్ణల ఆహ్వానం మేరకు దేవస్థానంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం దేవాలయంలో ఏర్పాటు చేయనున్న భోజనశాల శంకు స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిబాటలో భాగంగా దేవాలయాల అభివృద్ధి..భక్తుల సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవస్థాన మెంబర్లు తిరుమలశెట్టి భారత్, ఎన్‌వి కుమార్, రామకృష్ణ, ఆర్ఆర్‌కె, కొండలు, బాబు, అంజయ్య పాల్గొన్నారు.

కంద్రికలో జనని సీడ్స్ ప్రత్తి ప్రదర్శన క్షేత్రం

విశాలాంధ్ర-ఫిరంగిపురం : మండలంలోని కంద్రిక గ్రామంలో రైతుల పొలాల్లో జననీ వారి జననీ-555 కంపెనీ ఆధ్వర్యంలో ప్రత్తి ప్రదర్శన క్షేత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ ప్రదర్శన క్షేత్ర కార్యక్రమానికి ప్రముఖ జోసిల్ కంపెనీ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జనని-555 బీజీ-2 రకం అధిక వర్షాలతో వచ్చే తెగుళ్ల సైతం తట్టుకొని గులాబీ రంగు పురుగు, చీడపీడలను తట్టుకొని మంచి పంటతో అధిక దిగుబడులను తెస్తుందని రైతులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. జనని-555 రకం ప్రతికూల వాతావరణంలో కూడా అధిక కాపుతో ప్రత్తి తీతకు అనుకూలంగా ఉందని జెట్టి శ్రీనివాసరావు అనే రైతు తన పొలంలో ఏర్పాటుచేసిన ప్రత్తి ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు తెలియజేశాడు. ఫిరంగిపురం, సత్తెనపల్లి, ఎడ్లపాడు, నాదెండ్ల, మేడికొండూరు మండలాల నుంచి సుమారు 1500 మంది రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

విశాలాంధ్ర-పెదకూరపాడు: పీపీపీ విధానంలో నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు భైరా పట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం సమావేశంలో వారు మాట్లాడుతూ జివో నెం. 590తో పాటు గతంలో తీసుకొచ్చిన జివోలు 107, 108లను రద్దు చేయాలని కోరారు. పిపిపి విధానం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్య విద్య దూరమవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలు, ఉద్యోగ భద్రత, రిజర్వేషన్ హక్కులు దెబ్బతింటాయని ఆయన హెచ్చరించారు. నూతన మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిసెంబర్ 18న రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించి, ప్రజలు, విద్యార్థులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

16న నియోజకవర్గ సీపీఐ కౌన్సిల్

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఈనెల 16వ తేదీన పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కౌన్సిల్ సమావేశం మండల పరిధిలోని 75 తాళ్లూరు చల్లపల్లి సిపిఐ కార్యాలయంలో కౌన్సిల మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్ జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ పాల్గొన్నట్లు నియోజవర్గ పరిధిలోని అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు, అమరావతి, పెదకూరపాడు సిపిఐ సమితి సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

పోలీస్ కార్యాలయంలో నేటి పీజీఆర్ఎస్ రద్దు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అనివార్య కారణాల వల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దయినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి: సీపీఐ

విశాలాంధ్ర - వినుకొండ : టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. స్థానిక శివయ్య భవనంలో ఆదివారం పట్టణ సహాయ కార్యదర్శి కొండ్రముట్ల సుభాని అధ్యక్షతన సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉలవలపూడి రాము మాట్లాడుతూ 2014లో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలని సంకల్పంతో రాష్ట్రంలో టీట్కో గృహాల నిర్మాణంలో భాగంలో వినుకొండ పట్టణంలో కూడా లబ్ధిదారులను ఎంపిక చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి లబ్ధిదారులు డబ్బులు విడ తలవారీగా డబ్బులు చెల్లించటం జరిగిందన్నారు. ప్రభుత్వం కూడా 60శాతం పైగా కట్టడాలను పూర్తి చేశారని తెలిపారు. అయితే 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిందని, అప్పటి నుండి ఎన్నిసార్లు భారత కమ్యూనిస్టు పార్టీ లబ్ధిదారుల పక్షాన వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు అవుతుందని వెల్లడించారు. చిలకలూరిపేట, నరసరావుపేట అనేక ప్రాంతాల్లో టీట్కో గృహాలు అందించడం జరిగిందని, లబ్ధిదారులు ఆ గృహాల్లో నివాసం ఉంటున్నారని, వెంటనే వినుకొండ పట్టణంలో టిట్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం ఉదయం వినుకొండ మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం కమిషనర్‌కి వినతి పత్రాన్ని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 గంటలకు సిపిఐ కార్యాలయం వద్దకు లబ్ధిదారులు రావాలని, అనంతరం, మున్సిపాలిటీ కార్యాలయం వరకు కలిసి వెళ్దామని లబ్ధిదారులకు రాము పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వినుకొండ పట్టణ సహాయ కార్యదర్శి సుభాని, సీపీఐ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, సీపీఐ సీనియర్ నాయకులు పటాన్ లాల్ ఖాన్, సీపీఐ నాయకులు మహంకాళి సుబ్బారావు, షేక్ కిషోర్, శావల్యాపురం మండలం కార్యదర్శి రాయబారం వందనం, వినుకొండ రూరల్ మండల కార్యదర్శి కొప్పరపు మల్లి కార్జునరావు, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఆందోళనలు

విశాలాంధ్ర - దాచేపల్లి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 18న ఆ కళాశాలల వద్ద జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం దాచేపల్లిలోని రోశయ్య కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సీపీఐ మండల శాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన షేక్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 17 మెడికల్ కళాశాలల వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగు తాయన్నారు. పీపీపీ విధానం పేరిట వైద్య, విద్య విధానాల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, అదేవిధంగా ఈ నెల 18న చేపట్టే నిరసనలు, ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 10 వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ కు అప్పగించే ఉద్దేశంతో 590 జీవోను సీఎం చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చినట్లు తెలిపారు. సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, ఉపాధి భద్రత, నిరుపేద వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపే విధంగా ప్రభుత్వం వైఖరి ఉందన్నారు. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం కూడా అందని పరిస్థితికి ఈ విధానాలు తీసుకెళ్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలో స్థిరమైన ఉద్యోగాలు కూడా నిరుద్యోగులకు అందకుండాపోతాయన్నారు. పార్టీ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మండల శాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రోశయ్య కాలనీలో నివసిస్తున్న వారందరికీ ఇళ్ళ స్థల పట్టాలు ఇవ్వాలని, కాలనీలో సమస్యల పరిష్కారంలో భాగంగా అభివృద్ధి చేయాలన్నారు. పార్టీ నేతలు పత్తిపాటి నాగరాజు, రేపూరి రామయ్య, షేక్ సుభానీ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

రూ.2.6 కోట్లతో అభివృద్ధి పనులు: జూలకంటి

విశాలాంధ్ర - రెంటచింతల: ఎస్ఆర్జీఎస్, జిల్లా పరిషత్ నిధులు దాదాపు రూ.2 కోట్ల, 60 లక్షల వ్యయంతో మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా రెంటాల గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించగా.., రెంటచింతల, రైలుపేటలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించనున్న రూ. 44 లక్షల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ, వైఆర్ఎస్ స్కూల్ పక్కన బీసీ కాలనీలో మరో రూ.15 లక్షలతో నిర్మించిన మరో రోడ్డును ప్రారంభించారు. ఆ తరువాత మిట్టగుడిపాడు రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయగా.., జెట్టిపాలెం, మల్లవరం గ్రామాల్లో రూ.20 లక్షల సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన చేసి, ప్రారంభించారు. అనంతరం పశర్లపాడు గ్రామంలో రూ. 10 లక్షలు, తుమృకోట గ్రామంలో రూ. 15 లక్షలు, పాలువాయి గ్రామంలో రూ. 25 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. చివరగా పాలువాయి జంక్షన్ నందు జిల్లా పరిషత్ నిధులతో రూ. 60 లక్షల నిధులతో నిర్మించిన సీసీ డ్రైన్లను ప్రారంభించి, శిలాఫలకాన్ని అవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత హత్య



విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో మాచవరం గ్రామంలో కుటుంబ కలహాలతో భార్యను భర్త హత్య చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. దీంతో వారి ఇరువురు పిల్లలు అనాథలైనారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన అల్లాడి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌కు మండలంలో మాచవరం గ్రామానికి చెందిన మహాలక్ష్మీ (24) వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు. వెంకటేష్ బేకరీ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సాఫీగా సాగుతున్న వారి సంసారంలో మనస్పర్థలు మొదలైనాయి. దీంతో మహాలక్ష్మీ తన భర్త, పిల్లలను వదిలి మాచవరంలో తన పుట్టింటికి వెళ్లిపోయింది.నెలలు గడుస్తున్నా భార్య తిరిగి కాపురానికి రాకపోవడంతో వెంకటేష్ మాచవరం గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టిన మహాలక్ష్మీ భర్త వద్దకు వచ్చేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున మాచవరం గ్రామంలో గల తన భార్య మహాలక్ష్మీ వద్దకు వెళ్ళగా, ఇరువురు మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేష్ తను ధరించిన స్వెట్టర్‌కు ఉన్న లేసుతో భార్య మహాలక్ష్మీ గొంతు కేసి నులిమి హత్య చేయగా, అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో తన భార్య మృతదేహాన్ని బైక్ మీద పెట్టుకుని నేరుగా సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. పోలీసుల సూచనతో అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, అక్కడ వైద్య సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ ఉద్యమ ర్యాలీ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - వినుకొండ : పల్నాడు జిల్లా వైసీపీ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న మహా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ పిఏసి మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వినుకొండ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు శాసనసభ్యులు మాట్లాడుతూ. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షులు తప్పనిసరిగా హాజరై సోమవారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల పరిశీలకులు యెనుముల మురళీధర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొని, ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళమెత్తాలని నాయకులు పిలుపునిచ్చారు.

టిడ్కో గృహవాసులకు సకల సౌకర్యాలు: చైర్మన్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారులకు సకల సౌకర్యాలు అందుబాటులో తెస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ రఫాని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మున్సిపాలిటీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చైర్మన్ తెలిపారు. ముఖ్యంగా, టిడ్కో గృహాల్లో విద్యుత్ సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే అక్కడ బడి, గుడి, ఆసుపత్రి ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని ప్రకటించారు. ఇప్పటికే 500 గృహాలకు సంబంధించి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించామని తెలిపారు. కాగా, ఈ నెల 16వ తేదీన టిడ్కో గృహాల సముదాయంలో లబ్ధిదారులకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ పిలుపునిచ్చారు. లబ్ధిదారులు తమ గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా వారిపై ఉందని చైర్మన్ రఫాని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి తోట రాజా రమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - దాచేపల్లి : కేసానపల్లిలోని గీతా గురుకులం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ నుంచి ఆర్థో డాక్టర్ ప్రకాష్ రావు వచ్చి 50 మందికి పైగా రోగులను పరీక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిశెట్టి సాంబశివరావు మందులు ఇచ్చారు. ఉపాధ్యాయ బృందం శిబిరానికి సహాయ, సహకారాలు అందించారు.

17న పెన్షనర్స్ అసోసియేషన్ వార్షిక సమావేశం

విశాలాంధ్ర-దాచేపల్లి : ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ మండల శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో జరుగుతుందని శాఖ కార్యదర్శి, సీపీఐ సీనియరు నాయకుడు బుర్రి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు రాంపాటి రామయ్య హెూమియో క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కావున శాఖ సభ్యులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

మత్తు పదార్థాల సరఫరాపై ఆందోళన

విశాలాంధ్ర-తాడేపల్లి : జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా మరీ ముఖ్యంగా గుంటూరు నగరంలో గంజాయితో పాటు మత్తు పదార్థాలు యదేచ్ఛగా సరఫరా కావడం పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ చెప్పారు. ఆదివారం తాడేపల్లి వచ్చిన ఆయన మేక అమరారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మత్తు పదార్థాలు సరఫరా, అమ్మకాలపై పోలీస్ అధికార యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసి విక్రయాలను అరికట్టాలని కోరారు. అమ్మకాలు సాగిస్తున్న వారందరినీ అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని తెలిపారు. మాఫియా ఉచ్చులో పడ్డ యువతి యువకులను గుర్తించి, అలవాటు బారి నుంచి తప్పించేందుకు ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహించడంతోపాటు, కౌన్సిలింగ్ చికిత్స కేంద్రాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో జి.సుబ్బారెడ్డి, డి.కోదండరామయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం: ఎంపీ

విశాలాంధ్ర-ఫిరంగిపురం : రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వం ద్వారా రూ.2.45 కోట్ల వ్యయంతో మేరీకపూడి నుంచి మునగపాడు గ్రామం వరకు 2.5 కిలోమీటర్లు దూరంలో నిర్మించిన ఆర్ అండ్ బీ తారు రోడ్డును, అలాగే గుండాల పాడులో నిర్మించిన సచివాలయాలు హెల్త్ సెంటర్‌లను ఎంపీ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమాలు గావించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు గ్రామాల ప్రజలు పూల వర్షంతో ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, తాడికొండ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ బ్రహ్మయ్య, జనసేన ఇన్‌చార్జి విజయశేఖర్, మండల టీడీపీ అధ్యక్షులు మండవ నరసింహారావు, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్లకు సత్కారం

విశాలాంధ్ర-తాడేపల్లి : ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఇటీవల పలు శాఖల్లో డైరెక్టర్లుగా నియమితులైన రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ గుద్దండి నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవిని ఆదివారం సాయంత్రం తాడేపల్లి ప్రకాష్ నగర్ సెంటర్‌లో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.మహాలక్ష్మి, కె.మల్లేశ్వరరావు, బెజ్జం రామకృష్ణ, కొట్టె కిరణ్ శ్రీను, కె.కొటేష, కె.పసి, జి.అచ్చయ్య, అక్కల చెన్నయ్య, కె.కోటేశ్వరరావు, జిలగ అచ్చయ్య, ప్రసాద్, మన్నెం రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం: ఎంపీ

విశాలాంధ్ర-ఫిరంగిపురం : రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వం ద్వారా రూ.2.45 కోట్ల వ్యయంతో మేరీకపూడి నుంచి మునగపాడు గ్రామం వరకు 2.5 కిలోమీటర్లు దూరంలో నిర్మించిన ఆర్ అండ్ బీ తారు రోడ్డును, అలాగే గుండాల పాడులో నిర్మించిన సచివాలయాలు హెల్త్ సెంటర్‌లను ఎంపీ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమాలు గావించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు గ్రామాల ప్రజలు పూల వర్షంతో ఘనంగా స్వాగతించారు.

ఎముకలు, కీళ్ల వ్యాధి నివారణకు అధునాతన చికిత్సలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి ఆధునిక కాలంలో ఎముకలు, కీళ్ల వ్యాధి నివారణకు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పి.కృష్ణశ్రవంత్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య సభలో డాక్టర్ కృష్ణశ్రవంత్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆర్థోపెడిక్ విభాగంలో అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిన కారణంగా ఏవైనా ఇబ్బందులు వస్తే ఇంటికే పరిమితం అయ్యే పరిస్థితి లేదన్నారు. ఇప్పుడున్న అధునాతన వైద్య సహాయంతో ఆర్థోపెడిక్ వ్యాధులు సమస్యలు త్వరితగతిన నయం చేసి మంచి జీవితాన్ని అందించే అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పెద్దవారిలో మూడు రకాల ఆర్థోపెడిక్ సమస్యలు వస్తాయని, మోకాలు అరుగుదల, వెన్ను సమస్యలు, ఆస్టియో పోరోసిస్ వీటిలో మోకాళ్ళ అరుగుదల నిర్ధారణ అయినంత మాత్రాన శస్త్ర చికిత్స చేసుకోవలసిన అవసరం లేదని, అరుగుదల వల్ల రోజువారి కార్యక్రమాలు చేసుకొనుటకు ఇబ్బంది కలిగినప్పుడు మాత్రమే శస్త్ర చికిత్సకు వెళ్లవలసిన అవసరం ఉందని తెలిపారు. మోకాళ్ళ అరుగుదల తొలి దశలో ఉన్నవారికి గానీ లేదా 50 సంవత్సరాలు లోపు వారిలో గానీ గుజ్జుబట్టే టాబ్లెట్ల వల్ల కొంత మేలు ఉంటుందని, కానీ 60 సంవత్సరములు దాటిన తర్వాత ఆ టాబ్లెట్ల వల్ల ఉపయోగం ఉండదన్నారు. వెల్లకిలా పడుకున్నప్పుడు మోకాళ్ళ కింద దిండు వేసుకోవడం, ఒక పక్కకు తిరిగి పడుకున్నప్పుడు రెండు కాళ్ల మధ్య దిండు వేసుకోవడం లాంటి చిన్నచిన్న చిట్కాల ద్వారా కార్టిలేజ్ దెబ్బతినకుండా ఉంటుందన్నారు. మనం కూర్చునే భంగిమ డిస్కులపై ఒత్తిడి కలగకుండా ఒకే భంగిమలో ఎక్కువ సమయం కూర్చోకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే కొంతవరకు ఈ సమస్య రాకుండా నివారించవచ్చనన్నారు. మనం తీసుకునే ఆహారంలో క్యాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పన్నీర్, కోడిగుడ్డు, నువ్వులు లాంటివి తీసుకోవాలని సూచించారు. స్విమ్మింగ్, సైక్లింగ్, వాకింగ్, జాగింగ్, ట్రెడ్‌మిల్ వంటి వ్యాయామాల వల్ల వెన్నుపూసకు, మోకాళ్ళకు సమస్య రాకుండా ఉంటుందన్నారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు చంద్రశేఖరరావు, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ ఫణి కుమార్, ఆదిత్య హాస్పిటల్ పిఆర్‌ఓలు నురుల్లా, షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'డిజిటల్స్ హింసపై అవగాహన'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు ప్రసూతి మరియు గైనకాలజికల్ సొసైటీ (జీఓజీఎస్)ఆధ్వర్యంలో డిజిటల్ హింసకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా డిజిటల్ హింస నివారణ పద్ధతులు.. నివేదిక విధానాలను వివరించారు. డిజిటల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించడం, డిజిటల్ హింస సంఘటనలను వెంటనే నివేదించడం వంటి వాటిని తెలియజేశారు. అదేవిధంగా డాక్టర్ అనిత డిజిటల్ హింసకు చెందిన వివిధ రకాల గురించి చర్చించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్.సజీల డిజిటల్ హింసపై నిరంతరం అవగాహన కల్పిస్తున్న వైద్యుల బృందాన్ని ఆమె అభినం దించారు. అవగాహన కార్యక్రమంలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లతా మాధవి, డాక్టర్ అనిత, నర్సింగ్ విద్యార్థులు, హోప్‌విన్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.